
# నాకీ జనము వద్దు



## అయ్యగారి వెంకట సత్యవతి

సాయంత్రం ఏడు గంటలు కావస్తూంది. చలి కాలమేమో చీకటి చిక్కటి దుప్పటి తెర నలువైపులా చుట్టబెట్టడంతో వాతావరణం నిశ్శబ్దమయిపోయింది. ఆ గూడెంలోని మానవాకారాలు సూర్యుడు పశ్చిమాద్రికి క్రుంగడం చూస్తూనే తమ గూళ్ళల్లోకి క్రుంగిపోతారు. ఆకాశంలో మినుకు మినుకుమనే నక్షత్రాలకుమల్లే వారి గుడిసెల్లోంచి దీపాలు మినుకు మినుకుమంటున్నాయి. గట్టిగా గాలి వీస్తే ఘప్పున ఆరిపోయే ఆ చిరుదీపాలు ఆ గుడిసెలోని ప్రాణాలకి ప్రతీకలు. అక్కడి మనుష్యులు సజీవంగా వున్నారనేందుకు నిదర్శనంగా వుండుండి తప్పత్రాగి వచ్చిన మనుష్యుల బూతు తిట్ల వర్షాలు, అందులో తడుస్తూ గిలగిల లాడుతూ కీచుస్వరాలతో తిరుస్తున్న ఆడంగులు, వీటిని చూసి 'మాది పూర్తి కుటుంబమ'నే గుర్తుకు తెస్తున్నట్లు వారి సంతానమనబడే ఎముకల ప్రోగుల ఆర్తనాదాలు, దూరాన బంగళాలలో నివసించే ఉత్తమ జాతి మనుష్యులకదొక ఆకర్షణ.

ఇందులో యేది వినబడకపోయినా పెద్ద లోగిళ్ళ ఆసామీలకు వెలితిగా వుంటుంది. వారి భార్యలకు కాలక్షేపంగాక పిచ్చెత్తినట్లుంటుంది. ఎంత పెద్దగా అరుపులు వినబడితే, ఎంత గట్టిగా ఆడవారు గుండెలవిసేలా రోదిస్తే అంత వినోదభరితంగా, ఆహ్లాదంగా వుంటుందీ ఉత్తమ జాతివారికి. చల్లటి మలయమారుత పవనాల నాస్వాదించుటకు డాబా మీద పచార్లు చేసే ఉన్నత జాతివారికి, గూడెం నుండి సుమధుర సంగీత రవళుల ధ్వనులు వినిపించడం తటస్థించితే నొసలు ముడిపడుతాయి.

"హం వీళ్ళకక్కడ ట్రానిస్టర్లు కావల్సి వచ్చేయి. పట్టుమని పది మెతుకులు తిననోచుకోకున్నా సంగీతానికేం తక్కువలేదు" అనే ఈసడింపు, వ్యంగ్యపు నవ్వు దూసుకువస్తుంది. వారి దృష్టిలో గూడెంలో నివసించేవారు మనుష్యుల జాబితాలోకి రాకూడదు. వారికొక వ్యక్తిత్వముండకూడదు. అక్షరజ్ఞానం ఒంటబట్టకూడదు. సంగీతంపై అభిరుచి వృద్ధి చెందకూడదు. తమలాగే వారు చదువుకుని, స్వంత అభిప్రాయాలు - భవిష్యత్‌పై తీయని వూహలు అల్లుకుంటే తమ క్రింద పనిచేసేవారెవ్వరు? ఆశలు, ఆశయాలు వారిలో చిగురించరానీయకూడదు. అథవా చిగురించినా కూకటివ్రేళ్ళతో పెకలించి సమూలంగా నాశనం చేయాల్సిందే. అందరూ అందలం ఎక్కేవారయితే పల్లకి మోసేదెవ్వరు?

డాబా మీద చిరుచలిలో పుల్ వులెన్ సూట్‌లో పచార్లు చేస్తున్న ఈశ్వరరావు అసహనంగా పచార్లు చేస్తున్నాడు. బ్లడీ ఇండియా ఎక్కడబడితే అక్కడ పాడు గుడిసెలు. వూరికి దూరంగా ఎవ్వరి కంటికీ కనిపించని తావుల్లో యీ వెధవ గుడిసెలుండినా ఫర్వాలేదు. తమ బంగాళాలకి కాస్త దూరంలో దిష్టిపిడతల్లావున్న వీటిని చూసినా, అందులో తారట్లాడే శవాల్లాంటి మానవాకారాలు చూసినా ఈశ్వరరావు కడుపులో త్రిప్పి వాంతి వచ్చేటట్లు వుంటుంది. ఈ మధ్యనే అమెరికానుండి వచ్చాడేమో ఇండియా అన్నా, ఈ దేశంలోని ప్రజలన్నా పురుగులంత హీనంగా కన్పిస్తూ కంపరం కల్గుతోంది. తన తండ్రి తనకు దక్కవలసిన ఆస్తి దక్కనీయకుండా మేనకోడలికి పౌరుషంతో ఎక్కడ వ్రాసేస్తాడోనన్న గాభరాతో వచ్చేడు కానీ.... లేకుంటే యిప్పట్లో ఇండియా ముఖం చూసి వుండకపోయేవాడు. బ్లడీ సెంటిమెంట్స్.... సుభద్ర పుట్టకముసుపే తన భార్య అయిక్కూర్చుందిట. ఆ పిల్లకన్యాయం తలపెడితే నయాపైసా యిచ్చేదిలేదు పొమ్మన్నాడు తండ్రి. ఆ మూడు ముళ్ళు వేసి పడేస్తే ఆస్తి చేజిక్కించుకోవచ్చు. ఆ తర్వాతెటూవుండనే వుంది విడాకులు. పేరుకు తగ్గట్టు ధర్మంగా పోవాలని జూసే తన తండ్రి ధర్మారావంటే ఒళ్ళు మంట.

చికాగ్గా, అసహనంగా పచార్లు చేస్తున్న ఈశ్వర్రావు కాళ్ళు తక్కున ఆగిపోయేయి. నేతచీర బిగించి గోచిపోసి కట్టి, వేలుముడిఃప్రక్కగా మందారపువ్వు గ్రుచ్చి పాలరాతి శిలావిగ్రహం, అపురూపసుందరి నడచివస్తోందా.... అని భ్రమ కల్గించే పనిపిల్ల లక్ష్మి మీద ఈశ్వర్రావు కళ్ళు అణువణువునా అతుక్కుపోతూ తీయని జ్వాలని రగిల్చేయి. అనుభవంకోసం అర్రులు జాచే అతని కళ్ళకి లక్ష్మి అపర రతీదేవిలా కనిపించింది. ఆ క్షణాన గూడెంలోంచి పుట్టుకొచ్చిన మురికిముద్ద అనే ఏవగింపు మరుగున పడింది.

*

పోలయ్య కుక్కిమంచంలో యిటు – అటు దొర్లుతున్నాడు. ప్రక్క గుడిసెలోంచి గంజివాసన

ఘువ్వున నాసికాపుటాలనదరగొడుతూంటే కడుపులో ప్రేగులు కరకరమంటూంటే ఆకలిబాధతో లుంగచుట్టుకుపోతోందా ముసలిప్రాణం. కాళ్ళు, చేతులు పట్లుతప్పి, నీరసంతో కళ్ళు తేలిపోతూ వుంటే ఆకలి మీద, దానిని యింకా తీర్చని మనుమరాలి మీద మంటరేగింది. "ఛస్.... ఎదవాకలి. ఈ ఆకలే లేకుంటే ఎంత ధరమం మిగిలుండును? ఒకడ్నొకడు పొడుచుకు సచ్చేదీ యీ ఆకలికే. ఒకడి బాగుసూసి కడుపు మంట మండేదీ యీ ఆకలి తరువాతే. పొట్ట కూడు పడగొట్టేదొక ఆకలైతే, పొట్ట నిండీ ఆడకూతుళ్ళ కన్నాయం తలపెట్టేదొక ఆకలి. ఈ పెపంచకమంతా దరిద్రపు ఆకలే. ముండ ఏటయినాది? దొంగముండ. పీకల్దాక మెక్కుతాది ఆరియింట. ధరమోరావు బాబుగోరు నిజంగా ధరమ పభువులు. దానికింత సల్దన్నం యెట్టి, ముసిలిముండావోడికి కూడ అట్టుకెళ్ళమనీ యింత పారేస్తారు గనుక దీనికి ఊడ పని లేకుండ కండబట్టి నిగనిగ మెరుస్తావుంది ముండ. తల్లిని మింగిన దయ్యం. ముసిలోడు ఆకలితో సచ్చిపోతా కూకుంటాడన్న ఎరికనేదు. థూ...." అని యింకా రాని మనుమరాలిపై విసుక్కున్నాడు... పోలయ్య.

అతనికి విపరీతమైన కసిగా వుంది. తనకే శక్తి వుంటే యీ భూమ్మీద జనాన్నంతటినీ గుప్పిటజేర్చి నలిపి ముద్దగా, నజ్జునజ్జుగా చేసిపారేయాలని వుంది. తనమీద తనకే తెలీని జాలి, సానుభూతి. ఎలుగెత్తి బిగ్గరగా భోరుమని యేడవ్వాలన్న ఆవేదన సుళ్ళు తిరుగుతోంది.

"థూ....ఎదవ జనమ. అసలీ దేవుడికి బుద్దినేదు. మడిసిచేత అందరూ సమానులే అనిపిత్తాడు. అందరి ఒంట్లోను నీఁవూ, నెత్తురూ ప్రవహిత్తోంది అనిపిత్తాడు. మల్లా ఆళ్ళనేత ఘోరమైన పాపాలని చేయిత్తూ ఒల్లికుంటాడు. డబ్బేం సేసుకోవాలో తెలీక బుర్రలు బద్దలు గొట్టుకునేవారు కొంతమందయితే, మూడ్నాళ్ళయి మెతుకుముఖం సూడని తమబోంటివాళ్ళు కోకొల్లలు."

కాలికి చల్లగా ఏదో తగిలినట్లయి వులిక్కిపడి చూశాడు పోలయ్య. యజమానికేమి తీసిపోనన్నట్లు ఎముకల ప్రోవులా వున్న అతని పెంపుడుకుక్క తోకాడిస్తూదీనంగా చూస్తూ వుంది. "సత్....నీ.... నాకేలేదని నేనేడత్తావుంటే నీకేడనుండీపెట్టే ఎర్రిమొఖమా! ఆ యీరోయిను రావాల. మన ముఖాన యింత పడేయాల. దా....నా ఒడిలో కూకోవే బుజ్జీ. నాను తిండి ఎట్టనేరకపోయినా కబుర్లతో కడుపునింపగలనే పిచ్చిదానా! ఈ మాయదారి పెపంచకం గురించి సెప్పేదా? ఒద్దులే....ఒద్దు. తెలుసుకున్న నాను సేసేదేముంది బాధపడ్డం తప్ప? నీకెందుకులే ఆ బాధ. నన్నడుగుతే యీ యెదవ మడిసి జనమ కంటె పశువు జనమే నయం. మడిసి పశువు కన్నా హీనం. నాకే జనమంటూ వుంటే మడిసి జనమ వద్దేవద్దు. కుక్కగా పుట్టడం సానామంచిది. కుక్కకి యిశ్వాసమన్నా వుంటది. మడిసికి కుళ్ళు, కుట్రతప్ప మరేమి వుండదు."

పోలయ్య నిస్సత్తువుగా కుక్కిమంచంలో నడుం వాల్చేడు. దూరాన రైల్వేలైన్ నుండి ఎక్స్‌ప్రెస్ చెవులు చిల్లులుపడేలా భయంకరంగా అరుస్తూ పోలయ్య బలహీన గుండెల్ని దడదడలాడించింది. రైలు కూత విన్నప్పుడల్లా అతని మనసునెవరో కలచినట్లయి కుతకుతలాడిపోతాడు. తన మధుర స్మృతులు, గాయపడ్డ స్మృతులు ఒకదాన్నొకటి తరుముకొస్తూ అతన్ని వుక్కిరిబిక్కిరి చేసేస్తుంది. గత జ్ఞాపకాల సుడిగుండంలో చిక్కుకున్న పోలయ్య ఒక పట్టాన ఒడ్డున చేరలేక గిలగిలలాడిపోతూంటాడు. అప్పుడు తను ఏడెనిమిదేళ్ళ కుర్రాడు గాబోలు, తన అయ్యనేత రోజూ సావు దెబ్బలు తినేది అమ్మ. పగటేల కనిపించని అయ్య సీకటిపడుతూండగానే తూలుతూ వచ్చేవోడు. వత్తూనే బూతులు తిడుతూ వచ్చేవోడు. 'పైస'లిమ్మని అమ్మని పోరుపెడుతూంటే అమ్మ 'అరిసిగీపెట్టినా యిచ్చేది లేదు పొమ్మ'ని అరిచేది. దాంతో వెర్రి కోపంతో జుట్టుపట్టుకుని సావ సితకతన్నుతున్న అయ్యని జూసి తను గడగడలాడిపోతూ "అమ్మా! ఇచ్చెయ్యవే అయ్యకి డబ్బులిచ్చి పంపెయ్యవే!" అని యేడ్చేవోడు గట్టిగా.

అమ్మ అంత బాధలోను తనకేసి ఆప్యాయంగా జూస్తూ 'పిచ్చియెదవా! ఈడికి డబ్బిచ్చి పంపిత్తా నీకు కూడు యేడనుండి తెచ్చేదిరా సన్నాసీ! ఒల్లకుండు. ఆడేపోతాడు" అనేది. మరి కొంత కాలానికి అయ్య రావడం మానేసాడు. తను కొద్దిగా పెద్దయినాక తెలిసింది. ఎవర్తోనో యెల్లిపోయిందయ్య అని. ఆ రోజు తనకెంతో పండగలా తోచింది. అమ్మకింక దెబ్బలు కొట్టేవారు లేరనీ, డబ్బులిమ్మనిపోరులేదని.

కాని ఇచిత్రం. అమ్మ సాటున అయ్యకోసం యేడవడం తన కంటబడి అయోమయంలో పడిపోయేవాడు. ఇదేంటి? రాచ్చసుడిలాంటి అయ్య ఎల్లిపోతే అమ్మ సంతోసించక యేడుత్తాదేం?? అనుకునేవోడు. కూసింత పెద్దయినాక తను కూకుని, అమ్మ రెక్కలు ముక్కలు సేసుకుని తెచ్చే డబ్బుత్తినెయ్య కూడదనీ, తను కూడా కట్టపడాలనీ తెలుసుకుని టేషన్‌కాడ బూట్‌పాలిష్ సేసి డబ్బులు సంపాయించేవోడు. తన కట్టం సేసిన డబ్బుల్ని అమ్మ మురిసిపోతూ 'ముంత'లో దాస్తావుంటే తను మరింత వుత్సాగంతో కట్టపడేవోడు. 'ముంత' బేగే నిండిపోవాలన్న ఆత్రంతో 'పూరీ'లమ్మే బండాయన దగ్గర మంచి చేసుకుని సప్లయిర్ పనికుర్రాడ కుదురుకున్నాడు. బండి వొచ్చే టయామ్‌కి లగెత్తుకువొచ్చేవోడు. కాని సమయాలలో తన పెట్టె.. సరంజామా వుండనే వుండేది. పొద్దుగాల పావలాపెట్టి పూరీ....చాయ్ తాగి పొట్ట నింపుకుని మాపటేల యింటిముఖం పట్టేవోడు. తన తల్లి నలుగురిండ్లలో పాచి పనిచేసి వత్తూ వత్తూ గిన్నెల్లో కాసింత అన్నం...కూర కూడ తెచ్చేది. కలిగిన మా తల్లులు రోజూ యేదో ఒకటి యిత్తూనే వుండేవోరు. రాతిరికి అదే యిద్దరు పంచుకు తినేవోరు. పాతబడిపోయిన, చిరిగిన బట్టలు కూడ ఆరే యిత్తేవాటితోనే గడిపేసుకునేవోడు. ఆ విధంగా రోజులు సాఫీగా నడుత్తూ నాలుగు డబ్బులు కళ్ళబడేవి. ముంతలు నిండిపోయేవి. అవట్టుకెళ్ళి బాంకీలో దాచుకునేవోడు.

మడిసి చీకూచింత లేకుండ బతికేస్తే తనని మరచిపోతాడన్న బెంగ దేవుడికుంది కాబోలు. కట్టాలపరంపరతో మడిసి నాడించేసి నవ్వుకుంటాడు. ఆదినం తనకింకా కళ్ళకి కట్టినట్టే వుంది. ఆ రోజు పొద్దుటాలనుండి సూరీడు పెజలని సూసి సూసి యిసుగెత్తినట్లు ముఖం మబ్బుల్లో దాచేసుకున్నాడు. సూరీడు రాలేదన్న వుషారులో గాలిదేవుడు తనదే రాజ్యమన్నట్లు శివమెత్తినట్లు వూగిపోతూ వుక్కిరిబిక్కిరి చేసేడు. ఇది రాత్రి వేలకాదుగందా....అనేట్లు దట్టంగా సీకట్లు నలుమూలలా గుట్టుముట్టినయ్. తన గుండెల్లో గుబులు రేగింది. తనకేం నిచ్చెపంలా ప్లాట్‌ఫారమ్ కాడ ఒద్దికగా ఓ మూల తొంగుంటాడు. మరి అమ్మ? అమ్మ ఏడున్నదో? పాచి పనిచేస్తూ ఆ పెద్ద లోగింట్లో వుంటే బయంనేదు. అలాగాకుండ తమ గుడిసెకి సేరుకుంటేనే బయం. ఎదవ యిల్లు యిప్పుడా....అప్పుడా...అన్నట్లు కూలిపోయేందుకు సిద్దంగా వుంది. ముంతలో డబ్బులన్నీ రూపాయలేసి బాంకీలో పడేసిందు గనుక ఎదవకొంప

కూలినా ఫరవాలేదు. అమ్మ ఆ టయామ్లో ఆడ వుండకుండా వుంటే సరి. వొర్షం పెద్ద పెట్టున వచ్చేట్టున్నది. ఇప్పుడేటి సెయ్యడం? లగెత్తుకు పోదామంటే బండాయన పీక నులిమి సంపెయ్య గలడు. ఆడి యాపారం తనుతోడొచ్చినాక కల్సిరాడమేగాక తేలికైనది కూడ. ఆలోచిస్తూ బిక్కుబిక్కుమని దిగులుగా గుప్పెట్లో గుండె ల్నుంచుకుని చూస్తూన్నాడు పోలయ్య.

'టప్....టప్'మని పడ్డ చినుకు చూస్తూండగా కుంభవృష్టిగా....ఆపై పెనుతుఫానుగా మారి ప్రళయ తాండవంతో ప్రకృతిని బీభత్సం చేసేసింది. దూరాన వున్న రేకుల షెడ్డులోని రేకులు ఫెళఫెళ ఎగిరెగిరి పడుతూంటే పోలయ్య ప్రాణాలు ఎగిరిపోఁ జొచ్చినయ్. ఎదుటి ప్లాట్ఫారమ్ కనబడనంత చిక్కటి వాన వుధృంతంగా కురుస్తోంటే పోలయ్య కనులు అప్రయత్నంగా వర్షించేయి. 'భగవంతుడా! అమ్మ పెద్దోరి యింటికాడ వుండేటట్లుసేయి' అని వేయి దేముళ్ళకి మొక్కుకున్నాడు. నాలుగ్గంటలు విపరీతంగా హోరాహోరీ పోరాడిన గాలివాన అలసిసొమ్మసిల్లినట్లు విశ్రాంతి తీసుకుంది. మబ్బులు యింకా పరుగెడుతున్న సైన్యాల్లా గుంపులు గుంపులుగా పయనిస్తూనే వున్నాయ్. అంతవరకు భీకరంగా ఒరిగిపోతూ తలల్లూపేసిన చెట్లు యేమీ యెరుగనట్లు విలాసంగా మెల్లగా వూగుతున్నాయి. నష్ఠం మూలంగా బండీ కూడ లేటయింది రావడం. అదీ వెళ్ళంగానే పరుగు లంకించుకున్నారు పోలయ్య. దారిలో మొదలంటా కూలిపోయిన చెట్లనీ, ప్రేగుల్లా బయటపడ్డ వాటి వ్రేళ్ళనీ చూస్తూంటే పోలయ్య బెంబేలెత్తిపోయేడు. తమ గూడెం కేసి వరుగెత్తలేక మోకాళ్ళ లోతున్న నీటిలో అతి ప్రయాసపై నడుస్తూ చేతికాసరాగా దొరికిన చెట్టుకొమ్మని పట్టుకున్నాడు. కొద్ది క్షణాల లోనే తను పట్టుకున్నది చెట్టు కొమ్మ కాదనీ, చచ్చిన 'గేదె కొమ్ము' అనీ గ్రహించి కీచుమని భయంతో అరచి మరింత జోరు తెచ్చుకుని తమ యిళ్ళకేసి వెళ్ళేడు. అక్కడి దృశ్యం పోలయ్యని స్థంభీభూతుడ్ని చేసింది.

తన యిల్లు తెప్పలా నీటిలో తేలియాడుతోంది. కూలిన గోడలతో, అవశేషాలతో మిగిలివున్న ఆ యింటిని చూసేసరికి పోలయ్య దుఃఖం ఆగింది కాదు. చెదరిన మనస్సులో పెదబాబుగారింటికి వరుగెట్టేడు. "అమ్మగారూ! మా అమ్మ వుందా?" బెదురుతూ అడుగుతున్న తనకేసి అమ్మగారు తెల్లబోయి చూసింది క్షణం. "అరే పోలయ్యా! మీ అమ్మ అప్పుడే వెళ్ళిపోయిందిరా ఇంటికి! ఇంట్లో లేదా?" అనుమానంగా అడుగుతున్న అమ్మగార్ని చూసి బావురుమన్నాడు తను. "ఇంకెక్కడి యిల్లు అమ్మగారూ! మా అమ్మ.... మా అమ్మ... అసలు మీరెందుకు పోనిచ్చినారమ్మా మా యమ్మని" పిచ్చివాడిలా వెక్కి వెక్కి యేడుస్తున్న తనకేసి బాధగా చూసింది అమ్మగారు.

"నేనేం చేసేదిరా పోలయ్యా! ఎంత వద్దని హెచ్చరిస్తున్నా మొండికేసి వెళ్ళిపోయింది నారమ్మ. పోలిగాడింటికాడికి తనకోసం వచ్చేస్తాడంటూ ఒకటే గోల. 'వాడిక్కడకే వస్తాడులేవే' అని ఎంత జెప్పినా వింటేనా? 'మీకు తెలవదమ్మ గారూ! ఆడు నాకోసం చనం ఆగడు టేషన్ కాడ ముందుగాల మా గుడిసెకే పోతాడు. అప్పుడీ ఒర్సం పెద్దయిపోతే అడు ఆ ఎదవకొంపలో సిక్కడిపోతాడు. సత్తే యిద్దరం ఒకేసారి సత్తాం. నాను ఈడ సుఖంగా వుండనేరమ్మా!' అంటూ పరుగెత్తింది. ఏం చేస్తాం? వూరుకో. మృత్యు వావిధంగా నారమ్మని లాక్కెళ్ళింది. అంతా పోయే వాళ్ళమే ఎంత ఏడిస్తే మాత్రం మీ అమ్మ తిరిగొస్తుందా?" అంటున్న అమ్మగారికేసి వెర్రిగా చూస్తూ ఒకటే పరుగు లంకించుకున్నాడు.

"ఒరే పోలయ్యా! ఎక్కడికిరా పోతున్నావు? ఇలారా!" అంటున్న ఆవిడ మాటలు వెనకాల గాలిలో కలిసిపోయినయ్. అప్పట్నుంచీ టేషన్ తన సర్వస్వం. తనొక్కడి పొట్టకి దిగులు లేకుండ గడిచిపోయేది. అమ్మ జ్ఞాపకాలు వేధించకుండా చేతి నిండా పనికలిపించుకుని యింకా యెక్కువ డబ్బులు సంపాయించేడు. కాలందొర్లిపోతూవుంది. తనిప్పుడు వయస్సులో వున్న కోడెత్రాచు. అమ్మ మరుగున పడింది. నాగమ్మత్తకూతురు లచ్చి పేరుకు తగ్గట్టు లచ్చిందేవిలాగుండేది. దాన్ని సూస్తే తనలో తీయని బాధ. పెద్ద పెద్ద కళ్ళతో, బిర్రుజడతో, బిగించిన కోకతో....తను రెప్పవేయడం మరిచే వోడు. 'ఒలే లచ్చీ....నన్ను మనువాడతావేంటే? నీకు మంచి మంచి కోకలు కొంటాను. నగలెడతాను. పాచిపనికి ఎల్లనీయను' అంటే సిగ్గులమొగ్గయి 'మాయమ్మనడుగు' అనేసి తుర్రుమంది. అంతే ఆ యేడే లచ్మిలా తన యింట కాలుపెట్టి, తన మనస్సంతా ఆక్రమించుకుంది. తన యింటి ఆడది గుర్తుకు రాగా పోలయ్య గొంతు గరగరమంది దుఃఖోద్వేగంతో. లచ్చి! పిల్లతెమ్మరెలా వచ్చి తన బతుకులో పెనుతుపాను వదిలి ఎల్లిపోయింది. లచ్చిని కంటికిరెప్పలా చూసుకున్నాడు. అది కూడా తనంటే పాణాలిచ్చేది. తమ ఒద్దికకి రూపుగా రంగి వచ్చింది. తన రూపు, లచ్చి రంగుతో రంగి అందాలబొమ్మలా ఎదిగివస్తూంది. వయసు పెరుగుతున్నకొద్దీ లచ్చిలో కొత్త అందాలు తొణికిసలాడుతూ మిసమిస మెరిసి పోతూండేది. చక్కటి పెండ్లాం, ముద్దులొలికే కూతురు, చీకుచింతల్లేకుండా సాఫీగా సాగిపోయే కాపురం – వీటిని చూసుకుని తనంత అదృష్ట మంతుడు లేడీలోకంలో అని తెగ మురిసిపోయేవాడు.

ఓనాడు తనింటికొచ్చేసరికి లచ్చి మెలికలు తిరిగిపోతూ బాధపడిపోతోంది. తన గుండె గుభేలుమంది. పొద్దుగాల బాగానే వుండెనే తన కిట్టమయిన వంట వొండి ఆప్యాయంగా తినిపించి తనని పనిలోకి పంపిన లచ్చికింతట్లో యేం ముంచు కొచ్చింది? గాభరాగా పెండ్లాంని చుట్టేసుకుని "ఏందే లచ్చీ యిట్టాగయిపోతున్నవ్?" అని బావురుమన్నాడు.

అంత బాధలోను లచ్చి తనని గట్టిగా వాటేసుకుని "మావా! నీకన్నాయం సేసిపోతున్నా నన్ను చమించు మావా" అని యేడ్చింది. "లచ్చీ! ఏం జరిగిందో సెప్పవే ఎందుకు నా కన్నేయం తలపెట్టినావు?" అన్నాడు ఏడుస్తూ.

గదిలో మూలకి పోగెట్టిన గన్నేరు గింజల తుక్కు తనకంటబడింది. అదిరిపోయేడు తను. లచ్చి కావాలని పాణాలు తీసుకుంటోంది. ఎందుకో చప్పున తెలిసిపోయింది. అంతే పిచ్చి ఆవేశంతో కండ్లు తేలిపోతున్న భార్య భుజాలు పట్టుకు కుదుపుతో "లచ్చి! ఎవుడాడు నీ మానాన్ని కొల్లగొట్టిన దొంగనాయాల ఎవుడు? ఆడి రగతం కళ్ళ సూస్త సెప్పు సెప్పే!" వెర్రి కోపంతో శివమెత్తినట్లు వూగిపోతున్న తనని, కళ్ళు బల వంతాన తెరుస్తూ రెండు చేతులూ జోడిస్తూ దీనాతిదీనంగా.

"మావా! ఆవేశం తెచ్చుకోమాకు నీ కన్నాయిం చేస్తున్నానని నా బిడ్డ కన్నాయం సేయకు మావా! ఎవుడ్నీ సంపననీ మాటియ్యి మావా! మన బిడ్డకి అమ్మ అయ్య....యికపై నువ్వే తల్లి లేనిపిల్లకు తండ్రి కూడా లేకుండ సేయకు" అని వలవల యేడుస్తూ తన ఒడిలో కనుమూసింది.

తన లచ్చిని చెరచిన దొంగలం....ఎవుడు? సెంద్రిగాడా? ఎంకయ్యా?? ఎవులు?? "మావా! ఆ సెంద్రిగాడు యెదవ సూత్తూంటే ఒల్లికుంటి నిగండా....అని యెదవ ధయిర్యం చేసి సెయ్యి

అట్టుకున్నాడు. గూబ గుయ్యిమనిపించినాన్లే. తారెత్తి లగెత్తిందు. ఆడిజోలి మరిపోమాకు '' అని గలగల నవ్వింది. ఆడో పచ్చి రౌడీ ఎదవ అప్పుడే గుబులేసింది. ఆడి కళ్ళు లచ్చి మీద పడినందుకు ఇంకోమారు '' మావోయ్! నీ లచ్చి యీరోయిన్ అయిపోతున్నది. ఇయేల యేం జరిగిందో తెల్సా! ఆ ఎంకయ్య సచ్చినోడు లేడూ! ఆడు గారపళ్ళు యికిలిస్తూ '' ఇయాల రాతిరికి నాకాడకి రాయే ఒప్పులకుప్పా! డబ్బు దండీగా యిత్తాన్లే '' అని వాగేడు. అంతే మండుతున్న కొరకంచు గిరిగిర తిప్పి ఆడి కేసి కొట్టినా ' లబోదిబో 'మంటూ ఏడుత్తా పోయిండు దొంగసచ్చినోడు మదం యెక్కిన దున్నపోతులు. పెండ్లాలు సాలిఛావలేదు ఎదవలకి '' అంటూ పడీపడీ నవ్వింది.

లచ్చిని సూత్తావుంటే భయమేసింది. 'ఆ ఎదవ లేదైనా సేత్తే నా లచ్చిని' భయంతో గజగజ వణికి పోయేడు. ''ఒలే లచ్చీ! ఆళ్ళ జోలి పోమాకే ఆళ్ళు పగబట్టి నిన్ను నాకాక్కుండా సేత్తారే జాగరత్తే '' అని తనంటే '' పో.... మావా! పిరికి మాటలు నువ్వూను. ఆళ్ళ కెన్ని గుండెలుండాల నీ లచ్చి ఒంటి మీద సెయ్యేసేందుకు '' అని ధయిర్యం సెప్పింది.

అప్పటినుండి మరి ఆళ్ళ వూసెత్తలేదు లచ్చి. తను మర్చిపోయినోడు. పగబట్టిన తాచులా పొంచి వుండి కాటేసినారు. ఎదవలు లచ్చికి మాటిచ్చినాడు గనుక సరిపోయింది. లేకుంటే దొంగనాయాళ్ళ పుచ్చెలెగరకొట్టివుండు నీపాటికి. పళ్ళు పటపట కొరికాడు. సచ్చిన పెండ్లాం కోసం మొత్తుకున్నాడు. రంగిని పాణంలా చూసుకున్నాడు. రంగికి వయస్సొచ్చింది. బుద్ది మంతుడు, తన దగ్గర పనిచేత్తున్న ఎంకటేసుకిచ్చి పెండ్లి చేసినాడు. ఒకరిమీదొకరికి మనసుండాదని తెల్సి మురిసిపోయాడు. ఎంకటేసుక్కూడా ఎదవ వ్యసనాలు లేవు. ఆళ్ళ కాపరం కళ్ళకి పండుగ సేత్తూంటే, 'ప్రభూ! నాకింతేచాలు!' అని ఆనందంతో కళ్ళు ఒత్తుకునేవాడు. రంగికి నెల తప్పిందని తెల్సి తన ఆనందాని కంతులేదు. చక్కటి రంగుతో లచ్చి పోలికలతో పుట్టిన రంగి బిడ్డని చూసి తను ఒణుకుతున్న చేతులతో ''లచ్చి! ఈ రూపంతో మళ్ళీ నా చేతుల్లోకి వచ్చావా?'' అని ఆనందంగా కళ్ళనీళ్ళెట్టుకుంటూ లచ్చి.... లచ్చి అనుకున్నాడు మనసులో. తన మనసెరిగినట్లే ఎంకటేసు ''ఎలావుంది మావా.... మన లచ్చి?'' అంటే వులిక్కిపడ్డాడు తను.

అంత చిన్న పాపని ఎత్తుకోలేక తంటాలు పడుతూంటే కూతురు, అల్లుడు నవ్వుకునేవారు. మాయదారి దేవుడుకి తనతో ఆడుకోడం అల వాటయిపోయింది. తను నవ్వితే సూడలేడు. రంగికి అదేదో బాలింత జబ్బుచేసి హఠాత్తుగా చచ్చిపోయింది. ఎంకటేసు తల గోడకేసుకుని బాదుకున్నాడు. అప్పటిదాకా ముద్దులు చేసిన పసిగుడ్డును ''తల్లిని చంపిన రాకసి. దీన్ని నేను సంపుతా'' అంటూ పిల్లదగ్గరకి పిచ్చికోపంతో అడుగులేస్తున్న అల్లుడ్ని అతి కష్టంపై ఆప గలిగాడు. నాగమ్మత్త వచ్చి పసిదాన్ని సాక సాగింది.

ఎవుళ్ళనీ అతిగా పేమించకూడదు. పేమిత్తే దేవుడు సయించనేరడు. ఆడిని మరిసి పోతామని బెంగకాబోలు. ఎంకటేసు ఒకనాడెటో ఎల్లినాడు. ఆ ఎల్లిన మనిసి మరి రాలేదు. బతి కుండో సనిపోయిండో కూడా ఎరికలేదు. దాంతో


మీ కేశ సౌందర్యాభివృద్ధికి కొబ్బరినూనె కంటె అతి ఉత్తమమైనదేది?

OBM 6119/TG R



కేశవర్ధినిని

చేర్చిన కొబ్బరినూనె



ఔను! మీరు ప్రతి నిత్యమూ తలకు రాసు కుంటూన్న కొబ్బరినూనెలో కొన్ని చుక్కలు కేశవర్ధినిని కలపండి. తల చర్మానికి అంటే టట్టుగా తలకు రాసుకోండి.
ఇదే అందంగా తల వెంట్రుకలు పెరగడానికి సాంప్రదాయిక రహస్యము–కేశవర్ధిని.
వెంటనే ఒక బాటిల్ కేశవర్ధినిని కొని వాడండి.




కేశవర్ధిని ప్రోడక్ట్స్ (మద్రాసు)
మద్రాసు-600 092

'లచ్చి'గా సూసుకుంటున్న వసిదానిమీద తనకు యిరక్తి పుట్టింది. ఛ...ఇది లచ్చికాదు. అది దేవత. మొగుడు పెళ్ళాలను యిడదీసేబుద్ధి కలలో కూడా లేదు దానికి. ఇది పిశాచి బిడ్డ. తనకు భమ కలిగించేందుకు లచ్చి రూపంలో వచ్చిన రాక్షసే. ఆ రోజు లగాయతు తన కూడా ఆ పిల్లమీద యిసుక్కునేవాడు. రోజులు దొర్లిపోతు న్నాయ్. లచ్చి అందాలన్ని తనదే నన్నట్లు ఎదిగివచ్చింది. నడతల్లో కూడా లచ్చిపోలికలే.

ఆ చురుకైన కళ్ళు. అన్యాయం సయించ నేరని కోపం సూత్తావుంటే లచ్చి మళ్ళీ వచ్చిందా అనిపించేది. కానీ....కానీ...ఇది లచ్చి రూపంలో వున్న రాచ్చసి. వయసులో లచ్చి యిలాగే వుండేదనీ గుర్తుకొచ్చినప్పుడల్లా ఈ లచ్చి మీద కసి. కోపం పెరిగిపోయేది. పేరుపెట్టి ఎప్పుడూ పిలవబుద్దవదు. బూతులతో తిట్లతోను పిలుత్తాడు. ఒకోక్కసారి...'ఛ తను తప్పుసేతున్నాడా?' అను కోకపోలేదు. వెంటనే రంగి కళ్ళెదుట కదలాడి మనుమరాలిమీద ఎర్రికోపం వచ్చేస్తాది. నాగమ్మత్త తనకింక ఓపిక లేదంటూ యీలోకాన్ని వదలి ఎళ్ళిపోయింది. తనకితోడు, యీ రచ్చసే, 'తాతా రా బువ్వ తిందువు' అని అది ఆప్యాయంగా పిలిత్తే లచ్చిలాగుండాలని యేసాలేత్తోంది దయ్యం. అని ఒళ్ళు మండి 'అ పెట్టిపోయే శనిమొగమా! నాకేం నీవు తినిపించక్కర్లే' అని తిడితే – యింత మొగం చేసుకుని కళ్ళుతుడుచుకుని ఆడ పళ్ళెంలో తిండి పెట్టి ఎల్లి పోయేది. 'ఛ....ఎదవని, అంతలా తిట్టకుండా వుండాల్సింది. అనుకుంటాను. ఎదుర పడితే దానంతటదే వచ్చేస్తాది ఎదవకోపం. నానేం సేయను?'.

లక్ష్మి ధర్మారావుగారింట కాలు మోపింది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. అమ్మగారెటెల్లినారబ్బా. 'సాయంకాలం ఓ మాటు రావేలక్ష్మి! పిండి వంటలు పట్టుకెడుదువుగానీ' అన్నారు. ఏడకెల్లి నట్లు? అనుకుని చుట్టూ భయం భయంగా చూసింది. అప్పుడే మేడదిగి వస్తున్న ఈశ్వరరావు 'రాలక్ష్మి అక్కడే నిలబడిపోయావేం? అమ్మ గుడికెళ్ళింది. నీవొస్తావేమోనని చాలసేపు చూసింది. వంటింట్లో అంటుగిన్నెలు పెట్టే దగ్గర గిన్నెల్లో పిండి వంట ...ు పెట్టిందట. తీసుకెళ్ళమని చెప్పమంది' ...వ్వుతూ అన్నాడు. లక్ష్మికి కొంచెం ధైర్యం ...చ్చింది. మెల్లగా లోపలికి వెళ్ళింది. మూత పెట్టి ...న్న గిన్నెలు తనకోసం వేచివున్నాయి. తాతకి ...ారెలంటే ఎంతిట్టమొ. ఎప్పుడూ తాత తనని తిడతా వుంటాడు. ఆ తిట్ల ఎనక బాధ తనకు తెలుసు. అందుకే నవ్వుకుంటుంది. మరీ మోటుగా తిడితే బాధపడినా తనకి సంతోసమే. తాత.... పావం! ఇంకా పెండ్లాంని మరచిపోలేకున్నాడు. మొన్న మొన్న పోయిన కూతురికంటే ఎప్పుడో పోయిన పెండ్లాం మీదే తీపెక్కువ. నవ్వుకుంది మనసులో. పరధ్యానంగా గిన్నెలు ఎత్తుకోబోయిన లక్ష్మి చేతులమీద చేతులు పడ్డాయి. వులిక్కిపడి తలెత్తింది. బుసలుకొడుతున్న నాగులా, ఎర్ర జీరలు కళ్ళల్లో జివ్వుమని ఎగజిమ్ముతూంటే, భయంకరంగా నవ్వుతూ ఎదుట ఈశ్వర్రావు.

'ఛీ....వదులు. నన్ను పోనియ్యి. నీ జిమ్మడ' లక్ష్మి తుపుక్కున వూసింది. రెండు నిమిషాలు పెనుగులాట, లక్ష్మి చేతిగాజులు ఫెళఫెళ మన్నాయి. పెదవులనుండి రక్తం కసిగా రక్కింది. గోళ్ళతో గీరింది. నోటినుండి తిట్ల వర్షం. ఈశ్వర్రావు మౌనంగా తన పనిలో తీవ్రంగా నిమగ్నుడయ్యేడు.

"అబ్బా!" లచ్చి పంటిగాటుతో చేతిమీద గాయం. సన్నగా రక్తం.

'ఇంక వూరుకోవే పిల్లా! రెచ్చిపోతున్నావు. నా పంజానుండి తప్పించుకున్న 'లేడి' లేదింత వరకు' కోపోద్రేకంతో వూగిపోతూ పళ్ళు పటపట కొరికేడు. అమాంతం రెండుచేతులా ఆమెనెత్తి పడకగదిలోకి పరుగెత్తేడు. లచ్చి గిలగిల తన్ను కుంటూనే వుంది. శాయశక్తులా తిరగబడుతూనే వుంది. సృష్టి చేతిలోనే బలహీనురాలిగా జన్మిం చిన ఆడది. మరి యెదుర్కొనే శక్తి లేకపోయింది. డీలా పడిపోయింది. తెలివి వచ్చేసరికి విజయ గర్వంతో తనని చుట్టివున్న ఈశ్వర్రావు 'బాగా దెబ్బలాడేవు. అలిసిపోయేవు. చూడూ! ఆ జేబులో 'వంద' నోటుంది. పిండివంటలతోబాటు నేనిచ్చిన ఆనందాన్ని యింటికెళ్ళి తలుచుకొని నంజుకుతిను. ఆనందంతో ఖుషీ చేసుకో' అన్నాడు.

అస్తవ్యస్తంగా వున్న బట్టలు సరిజేసుకుంది. లేచి నిలబడి క్రూరంగా ఒకసారి ఈశ్వర్రావుకేసి చూసింది. "చేసుకుంటారా ఖుషీ చేసుకుంట" పళ్ళు నూరింది. 'చింత చచ్చినా పులుపు చావలే' దన్నట్లు, లొంగిపోయినా రోషం తగ్గలేదు. విరగబడి నవ్వుతున్న ఈశ్వర్రావుని నిప్పులు కురిపిస్తున్నట్లే ఒక్క చూపు చూసి రివ్వున వంట గదిలో జొరబడింది. తనకి కావల్సిన దానికోసం వెతికింది. అది దొరికిన వెంటనే విజయోత్సాహంతో చేతులు వెనక్కి వుంచి ఈశ్వర్రావుని సమీపించింది. 'ఒరేయ్! దొంగ సచ్చినోడా! నాక్కావల్సింది. 'వంద' నోటు కాదురా సన్నాసీ! నాక్కావల్సింది నీ రగతం....నీ రగతంతో పిండివంటలు నంజు కుంటారా కుక్క!' భయంకరంగా వూగిపోతున్న లక్ష్మివంక తెల్లబోయి చూస్తున్న ఈశ్వర్రావు బెదురుగా లేవబోతూ.

'అబ్బా....చచ్చాన్రోయ్!' అంటూ గావుకేక వేసి వెనక్కి విరుచుకు పడిపోయేడు. గుండెల్లో దిగిన చాకునుండి రక్తం ధారలు కడుతూంటే పిచ్చిగా గంతులు వేసింది లక్ష్మి. ఒక క్షణం ఆలస్యం చేయకుండ వంటకాలు 'తాతకోసం' తీసుకుంది. పరుగు వేగంతో నడుస్తూ మధ్యదారిలో తనకోసం 'యేదో' తింది. అది రాయినేసి పగులగొట్టి తింటూ విపరీతంగా నవ్వింది. పోలయ్య తిట్లు సమీపించేయి. అంటే తాత దగ్గర కొచ్చేసిందన్నమాట.

'తాతా!' గట్టిగా అరుస్తున్న లచ్చి కేకకి పోలయ్య గగుర్పాటుతో కుక్కి మంచంలో లేచి కూర్చున్నాడు. "ఏందే ముండా! ఇంతాసె లీకం సేసినావు. ఇక్కడ ఈ బక్క పాణం వుండాల్నా....పోవాల్నా?' అన్నాడు. విరగబడి నవ్వుతున్న లచ్చివంక ఆశ్చర్యంగా చూశాడు. "తాతా! భయపడకు. నాకు పిచ్చెక్క లేదు. తాతా! నీకోసం బూరెలు తెచ్చేను. మన వయసులో తెగ సంపేవోడివి:... కదూ తాతా! 'లచ్చి బూరెలు సేసిపెట్టే' అని అవును తాతా! అలా గుడ్లు తేలెయ్యకు నేను.... నేను....ఆ లచ్చినే తాతా.... ఆ లచ్చినే నీ పేమ నన్ను మళ్ళీ పుట్టించేలా సేసింది. కానీ నీకు సెప్ప లేదు నేనే....అని కానీ....కానీ....విది మల్లా నా కన్నాయం సేసింది. ఈశ్వర్రావు నన్ను బుగ్గి సేసేడు. ఆడివి సంపేసినా తాతా! యీ లచ్చి నీ లచ్చిలా పిరికిది కాదు. సంపి... సత్తా వుంది. అప్పటిలాగే....గన్నేరు పప్పుతోనే సత్తావుంది. తాతా! ఇంకెప్పులూ నన్ను పిలవమాక నాకింక జనమ వద్దు. నాకీ జనమ వద్దు నన్ను పిలవమాక నాకోసం బాధపడమాకు తాతా! పేమిత్తే దేవు డెత్తుకపోతాడన్నావు. నన్ను ద్వేసించేవు. అయినా నన్నూ ఎత్తుకపోతావున్నాడు తాతా! దేవుడు మంచోడు" కుప్పలా కూలిపోయిన లచ్చివంక పిచ్చిగా చూస్తూ 'లచ్చీ! మల్లా నా కన్నాయం సేసి పోయినావా?" అంటూ అరుస్తూ నిలువు గుడ్లేశాడు పోలయ్య. □